


# నాన్న

తెన్నేటి సుధ

ఒక్కసారి ఉలిక్కిపడి నిద్ర లేచాను. ఏవో పీడకలలు.... ఉదయం లేచిన దగ్గర్నుంచీ మనసంతా కలతగా ఉంది. అసలు రాత్రంతా ఏవో ఆలోచనలు.... కలత నిద్రలో ఎన్నెన్నో జ్ఞాపకాలు.

నిన్నట్నుంచీ పదేపదే నాన్న జ్ఞాపకం వస్తూనే ఉన్నాడు. ఇప్పుడు నాన్న ఎట్లా ఉన్నాడో- మనస్సు మూలలో ఏదో బాధ కలుక్కుమంటోంది. 'అంత ప్రేమగా చూసుకునే నాన్నను

వదలి నే నెందుకు పారిపోయి వచ్చాను?-' ఇల్లు వదిలిన ఈ పదేళ్ళలో చాలా సార్లు ప్రశ్నించుకున్నాను. ఇంటికి వెళ్దామని ఎన్ని వందల సార్లో అనుకున్నాను. కానీ ముఖం చెల్లలేదు. అవును ఇంటికి పెద్ద కొడుకుగా నాన్నకు నేను మానసికంగానైనా ఏం సుఖశాంతుల్నిచ్చాను?

గతం నీడలు వదలకుండా మనసును వేధిస్తూనే ఉన్నై.

నాన్న బడిపంతులు. నిజాయితీకి, మంచితనానికీ మారుపేరు- మంచి టీచరుగా కూడా గుర్తింపు ఉంది.

తనకు చదువు చెప్పాలని నాన్న ఎంతగానో ప్రయత్నించారు.

బడి ఎగ్గొట్టి గోలీలు ఆడుతున్నట్లు తెలిసి మందలించారు- బుజ్జగించారు. ఊహుఁ చదువంటే ఇష్టంలేదు తనకి.- అదొక నిర్బంధంగా ఉండేది.

వేరే స్కూలయితే ఎగ్గొడ్తున్నానని తను పని చేసే బళ్ళో చేర్పించాడు నాన్న.

అసలప్పుడే కథ మలుపు తిరిగింది. తను నాన్న బళ్ళో చేరనన్నాడు.

ఆయన కళ్ళ నీళ్ళు పెట్టుకుని, "చదువు లేనివాళ్ళకి విలువ లేదురా- నువ్వు డాక్టరువో, ఇంజినీరువో కావాలన్న పేరాశ నాకు లేదు- అంత బరువు కూడా నేను మొయ్యలేను- కనీసపు డిగ్రీ అయినా ఉండాలి కదా"- అన్నాడు.

ఆ ఆవేదన ఆనాడు నే నెందుకు అర్థంచేసుకోలేకపోయినాను?- ఒక్కసారి పదేళ్ళు వెనక్కి జరిగి ఆ రోజొస్తే ఎంత బాగుంటుంది.

"నాకు చదువంటే ఇష్టంలేదు" చాలా పొగరుగా జవాబు చెప్పాను.

"జీవితంలో మనిషిగా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడానికి చదువు చాలా అవసరం బాబూ! చదువుకోకుండా ఏం చేస్తావు చెప్పు"- ఆ మాటల వెనక ఎంత ఆవేదన ఉన్నదో!

"నీకేం పన్లేదు. ఎప్పుడూ చదువు చదువని ప్రాణాలు తింటావ్. ఈసారి చదువు మాట ఎత్తితే ఇంటికే రాను...." బెదిరించి బయటికి పరుగుతీశాను. నా లాంటి మరో నలుగురైదుగురితో కలిసి రోడ్లు పట్టుకుని తిరగడం- సరదాగా ముక్కలాడడం- అట్లా గడిచిపోయేవి రోజులు.

సాధారణంగా నాన్నకి కోపం రానే రాదు. తనంటే ఎంత ప్రేమ.... ఏమిటి నోటికి ఉప్పగా తగుల్తోంది- ఓహ్ కన్నీరు.... తనెందుకు ఏడుస్తున్నాడు?... నాన్న ప్రేమ.... అవును ఒక్కసారి నాన్న దగ్గరికెళ్ళి మళ్ళీ చిన్నవాడై 'నాన్నా! ఇంకెప్పుడూ నిన్ను బాధ పెట్టను. నీతోనే ఉండిపోతాను'- అని చెప్పగలిగితే- తను ఆఫీసరవుతే....? ప్చ్.... లాభంలేదు.

ఏదైనా పనిమీద నాన్న బయటికి వెళ్ళి ఆలస్యంగా ఇంటికి వచ్చినప్పుడు తను నిద్రపోతుంటే లేపేవాడు. 'నాన్నా

రాజా! నీ కోసం స్వీట్ తెచ్చాను. తీసుకోమ్మా- తిని పడుకో....' ఆ రాత్రి అది తినిపిస్తేగానీ ఆయనకు తృప్తిగా ఉండేది కాదు. తిన్నాక మంచినీళ్ళు తాగించి సరిగ్గా పడుకోబెట్టి దుప్పటి కప్పేవాడు. ఆ ప్రేమ విలువ నేను గుర్తించానా?

ఎట్లాగో తొమ్మిదో క్లాసు కొచ్చాను. వార్షిక పరీక్షలు- బలవంతాన నాన్న ఏవో ఒకటి రెండు పాఠాలు చెప్తుంటే ఆవులిస్తూ విన్నాను.

తెల్లారి లెక్కల పరీక్ష. ఆ లెక్కలెందుకో నా కసలు బుర్రకెక్కవు. ఆ పరీక్షకు నేను వెళ్ళలేదు.

రాత్రి 11గం॥లకు ఇల్లు చేరాను. నాన్న ఏమంటాడో అని భయంగానే ఉంది. నాన్న నా కోసం కాచుకొని ఉన్నాడు నిద్రపోకుండా.

నేను అన్నం తిని వచ్చిందాకా ఏం మాట్లాడలేదు. అట్లా గమనిస్తుండిపోయాడు. పడుకోడానికి వెళ్ళబోతుంటే అప్పుడు పిల్చాడు.

"లెక్కల పరీక్ష ఎందుకు వ్రాయలేదు?"

"నాకు లెక్కలురావు" తలబిరుసుగా జవాబిచ్చాను.

"రాకపోతే నేర్చుకోవాలి" మృదువుగా అన్నాడు.

"నా కసలు చదువుకోవడమే ఇష్టం లేదు."




"దౌర్భాగ్యుడా! ఈసారి చదువిషం లేదన్న మాటంటే చంపేస్తాను.." నాన్న సహనం కరిగిపోతోంది.

"ఈసారి నువ్వు చదువు మాట ఎత్తితే నీ ఇంట్లో ఒక్క క్షణం ఉండను." అంతకంటే పై స్థాయిలో అన్నాను.

నాన్న సహనం కరిగిపోయింది. "పండితపుత్ర అన్న మాట నిజం చేశావురా- నువ్వు చదువుకొని వృద్ధిలోకి వస్తావని ఆశపడ్డాను. కానీ ఇట్లా అవుతా

వనుకోలేదు- నిన్నిట్లా చూసేకంటే కంటిముందు లేకపోవడమే మనశ్శాంతి ...." నాన్న గొంతు గద్గదంగా పలి కింది. మరుక్షణం ఆ స్వరంలో తీక్షత .... "పోరా పో...ఉండి ఉద్ధరించేదేముంది?"- అన్నారు. చివరిమాట ముల్లులా గుచ్చు కుంది. రోషంగా బయటికి రెండడుగులు వేశాను.

వెనుకనుంచినాన్నస్వరంలో ఆరాటం ధ్వనించింది- "ఎక్కడికిరా?"

"నా ఇష్టమొచ్చిన చోటుకి" తల ఎగరేశాను.

"చాల్లే! వచ్చి పడుకో"- నాన్న ప్రేమగా కసరడం పదేళ్ళ క్రిందటైనా స్పష్టంగా గుర్తుంది.

"నే నింక రాను"-వెనకనుంచి నాన్న పిలుపు నేను వినిపించుకోలేదు.

గమ్యంలేని నడక- ఈ పదేళ్ళూ గమ్యంలేని నడకే- ఎక్కడా స్థిరత్వం లేదు. చదువుకోనందుకు కుమిలిపోని క్షణం లేదు. కడుపు నిండక కాళ్ళు కడుపులో పెట్టుకున్ననాడు నాన్న మాటలే- కూలీ దొరకక ఊరూరా తిరిగి నప్పుడూ నాన్న మాటలే. అదృష్టముండి ఏ పెళ్ళిలోనో ఒకరోజెప్పుడైనా ఒక స్వీటు దానం దొరికిననాడూ నాన్న తలపులే. నాన్న మరపుకు రాలేదు- ఆ ఆప్యాయత, ప్రేమ ఆయన విలువ, చదువు విలువ- జీవితంలో ఒక్కొక్క అనుభవంతో బాగా తెలిసొచ్చింది. పేపర్ బాయ్‌గా, స్టేషన్లో కూలీగా- ఎన్నో అవతారాలు.

ఉద్యోగం చేసేవాళ్ళను చూస్తుంటే నాన్న నా కోసం ఎందుకంత ఆవేదన పడేవాడో అర్థమయ్యేది.

దీనికి తోడు విధి నాతో మరోసారి చెలగాటమాడింది. అన్నాళ్ళూ ఏ కూలీ నాలీతోనో భుక్తి గడిచేది. కానీ రోడ్డు పక్క ఫుట్‌పాత్‌మీద పడుకున్న నేను హఠాత్తుగా మేల్కొన్నా నొకరోజు. అర్థరాత్రి- తప్పతాగిన లారీ డ్రైవరొకడు లారీ ఫుట్‌పాత్‌మీదకి ఎక్కించేశాడు. ఇద్దరి ప్రాణాలు పోగా నా కుడిచెయ్యి విరిగిపోయింది.

ఆ రోజు నాన్నను తల్చుకుని కుళ్ళి కుళ్ళి ఏడ్చాను. అప్పట్నుంచీ ఊళ్ళో వాళ్ళ దయాధర్మాలమీద ఆధారపడడం తప్పనిసరైంది. అసలు బతికేదెందుకో కూడా అర్థంకాకుండా.

మోకాళ్ళమధ్య తల పెట్టుకుని ఎంత సేపు ఏడుస్తూ కూర్చున్నానో- చనిపోయే లోపల నాన్నను ఒక్కసారి చూడాలన్న కోరిక తీవ్రతరమవుతోంది. ఒక్కసారి నాన్నను క్షమించమని అడగాలి. నాన్న స్పర్శలో సుఖం అనుభవించాలి. ఊరు వెళ్ళిరావాలి. ఇన్నాళ్ళ అహం కరిగి పోయింది. చాలా గాఢంగా మనసులో ఈ కోరిక మొదలైంది.

రోశయ్య 'రాజా, రాజా'- అని కుదుపుతుంటే ఎర్రబడిన కళ్ళతో ఏమి

టన్నట్లు చూశాను_ జ్ఞాపకాలు చెదిరి పోయినై.

"తొందరగా లేవాలి"- రోశయ్య నా చెయ్యి పట్టుకుని లేపాడు. వాడి కళ్లు ఆనందంతో వెలిగిపోతున్నై.

"సంగతేమిటి?" నిర్లిప్తంగా అడిగాను. 'హుర్రే'_ అని ఆనందం సూచించే ఒక కేకవేసి "ఏమిటంటావేంటి? ఎవడో దిక్కు_లేని చావు చచ్చాడు. దానగ్గర కూచుని రెండు బుడి బుడి రాగాలు తీశావంటే డబ్బులే డబ్బులు"సంబరంగా చెప్పాడు రోశయ్య.

అయిష్టంగా, నిరాసక్తంగా రోశయ్యతో ముందుకు నడిచాను. 'ఒకరి చావు ఒకరికి పండుగా?' మనస్సు చాలా ఆవేదనగా ఉంది. అడుగులు తడబడుతున్నై. ఏదో అదృశ్యశక్తి నడిపిస్తున్నట్లు నడిచాను.

శవంమీద పూర్తిగా బట్ట కప్పివుంది. రోడ్డుపక్క_న అనాధలాగా పడిఉన్న ఆ శవాన్ని అప్పటికే ఆ రోడ్డున వెళ్ళే వాళ్ళు పరికించి చూస్తున్నారు. నేను శవాన్ని సమీపించాను. హఠాత్తుగా వీచిన గాలికి శవం మొహంమీద బట్ట తొలగిపోయింది.

అంతే! మనస్సులో బండరాయి పెట్టినట్లైంది. ఎవరది?.... నా.... నాన్న.... దిగ్భ్రాంతిగా చూశాను_ అంతే దుఃఖం కట్టలు తెంచుకుంది. ఏడుస్తూనే ఉన్నాను. ఎంత ఏడ్చినా మనసులో వేదన తీరడం లేదు. చుట్టూ మూగినవాళ్ళతో ఏదో చెప్తున్నాడు రోశయ్య. అంతా జాలి పడుతున్నారు. చిల్లరడబ్బులు రాలుతున్నై.

'భలే ఏడుస్తున్నావ్'- అన్నట్లు చూపుడువేలు, బొటనవేలు కలిపి అభినయిస్తున్నాడు రోషయ్య, నేను మధ్యలో తలెత్తి చూసినపుడు.

కొందరు- ఇది నాటకమని తరలి పోతున్నారు. క్రమంగా జనం తప్పుకున్నారు.ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి పోయాను. మనసంతా శూన్యంగా ఎడారిలా ఐపోయింది.

"ఇంకా ఎంతసేపు ఆ శవాన్ని అంటిపెట్టుకునుంటావ్? మన పని ఐపోయింది. దీన్ని వదిలించుకోకపోతే లేనిపోని బెడద. అయినా ఆ దిక్కు_లేని శవాన్ని దగ్గర పెట్టుకుని ఏదో మీ అయ్య చచ్చినట్లు నిజంగానే ఏడుస్తావేం?" రోశయ్య నా వీపు తడుతూ అడిగాడు.

"చచ్చిపోయింది నిజంగా మా నాన్నే రోశయ్యా!" అతి కష్టంమీద పలికాను. నా కింకా కన్నీరు జారిపోతూనే ఉంది. కన్నీటిపొరల మధ్య దిగ్భ్రాంతితో నిలబడ్డ రోశయ్య ఒకపక్క_, జీవరహితంగా పడిఉన్న నాన్న మరొకపక్క_ మసకమసగ్గా కనిపిస్తున్నారు.

———